


# కరపత్రం

SINCE 2014

గురువారం సెప్టెంబర్ 17,2026 సంపుటి : 2 సంచిక : 339 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4

## కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై
# విచారణకు ఆదేశం

- 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలి: రేవంత్
- 700 ఎకరాలపై లెక్క తేల్చాలి



- 388 ఎకరాలు ప్రభుత్వ భూమేనని ఆరోపణ
- ప్రభుత్వ భూమిని పేదలకు పంచుతాం
- రూ.లక్ష కోట్ల భూ కుంభకోణం: సీఎం
- ధరణి పార్ట్--2 అక్రమాలు త్వరలో బయటపెడతాం
- భూ అక్రమాలపై ఎస్ఈటీ ఏర్పాటు
- 22ఏ సమస్యలపై హైపవర్ కమిటీ
- వారంలోపు 22ఏ మార్గదర్శకాలు
- జీవో 118 దరఖాస్తులు పరిష్కరిస్తాం
- ఎల్బీనగర్‌లో 9,500 మందికి శుభవార్త



**హైదరాబాద్:**
ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. 30 రోజుల్లో విచారణ జరపాలని శాసనసభ వేదికగా తెలిపారు. 700 ఎకరాల ఫామ్‌హౌస్ కేసీఆర్‌కు ఉందో? లేదో తేల్చాలన్నారు. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కేసీఆర్ ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ఫామ్‌హౌస్‌లోని ప్రభుత్వ భూమిని పేదలకు పంచిపెడతామని ప్రకటించారు. 22ఏ నిషేధిత భూముల అంశంపై అసెంబ్లీలో సీఎం మాట్లాడారు.

"సిద్ధిపేటలో కేసీఆర్ కుటుంబానికి 67.5ఎకరాలు ఉంది. కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు, హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కల్వకుంట్ల కవిత కుటుంబానికి 37 ఎకరాలు, జోగినపల్లి సంతోష్‌రావు కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్‌రావుకు 52 ఎకరాలు, కొండల్‌రావుకు 48 ఎకరాలు ఉంది. కల్వకుంట్ల కుటుంబానికి 9 జిల్లాల్లోని 24 మండలాల్లో 31 గ్రామాల్లో 439 ఎకరాలున్నాయి. కేటీఆర్ జన్వాడ ఫామ్‌హౌస్‌పై నేనెందుకు బాంబులు వేస్తా? ఆయనేమైనా బిన్‌లాడెనా.. రోడ్డు మీద పిచ్చికుక్క కూడా కరవదు. స్టీఫెన్‌సన్‌కు ఎన్నికల ముందు నజరానా ఇచ్చారు. రూ.50 కోట్ల భూమిని రూ.1.53 కోట్లకే రెగ్యులరైజ్ చేశారు. గంగుల, ఎర్రబెల్లి, సుధీర్‌రెడ్డి 650 ఎకరాల ప్రభుత్వ భూమి కొనుగోలు చేశారు. జగదీశ్‌రెడ్డి 50 ఎకరాల ఫామ్‌హౌస్‌లో 11.5 ఎకరాల ఇనాం భూమి ఎలా వచ్చింది. పైలెట్ రోహిత్‌రెడ్డి అజీజ్‌నగర్‌లో అసైన్డ్ భూమిలో ఫామ్‌హౌస్ కట్టుకున్నారు. ఒక కుటుంబానికి కుష్కి పొలం 54, తరి పొలమైతే 27 ఎకరాలుండాలి. కానీ, కేసీఆర్‌కు ఉన్నది మొత్తం తరి పొలమే" అని సీఎం వివరించారు.




## దానం నాగేందర్ అనర్హత పిటిషన్ తీర్పు వాయిదా

**హైదరాబాద్:**
ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. తీర్పును శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది. కాగా బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్.. కాంగ్రెస్‌లో చేరారని ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరుతూ స్పీకర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ అంశంపై విచారణ చేపట్టిన స్పీకర్.. చట్టపరంగా ఆయన పార్టీ మారలేదంటూ తీర్పునిచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు వాదనలు విన్న సీజే ధర్మాసనం తీర్పును శుక్రవారానికి వాయిదా వేసింది.

## యూపీఐ ఛార్జీలపై
# రాజకీయ దుమారం

- విదేశీ ఒత్తిళ్లు లేవు: కేంద్రం
- స్వతంత్రంగానే నిర్ణయం తీసుకున్నాం
- రూ.2,000 లోపు లావాదేవీలకు ఛార్జీలు లేవు
- ఆపై నిర్దిష్ట లావాదేవీలకు 0.4% MDR
- అక్టోబర్ 15 నుంచి కొత్త ఛార్జీలు
- P2P, రూ.2,000లోపు P2Pీకు MDR వర్తించదు
- యూపీఐ ట్యాక్స్: రాహుల్ గాంధీ
- అమెరికా పేమెంట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చే నిర్ణయం: కాంగ్రెస్
- యూపీఐ ఛార్జీలను వెనక్కి తీసుకోవాలి: కాంగ్రెస్

2 లో




యూపీఐ లావాదేవీలపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మర్చంట్ డిస్కౌంట్ రేటును విధించడంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఇందులో ఎలాంటి విదేశీ ఒత్తిళ్లు లేవని..

## సీఎం చెప్పిన భూముల
# చిట్టాపై నిజాలు తేలాలి



- అందరి భూములపై సీబీఐ విచారణ జరపాలి
- సీఎం వ్యాఖ్యల్లో వాస్తవాలు నిగ్గు తేల్చాలి
- ఎన్నికల అఫిడవిట్‌లో ఉన్నదానికంటే అదనంగా భూమి ఉంటే సరెండర్
- భూముల వివరాలపై సమగ్ర దర్యాప్తు చేయాలి
- ప్రభుత్వ నిబంధనలకు మించి ఒక్క గజం లేదు: కవిత
- 22ఏ భూముల వ్యవహారంపై పూర్తి విచారణ కోరిన కవిత

**హైదరాబాద్:**
శాసనసభలో 22ఏ భూములపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పారని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కవిత విమర్శించారు. సిద్ధిపేట జిల్లాలో కవిత, ఆమె భర్త పేరు మీద 37.26 ఎకరాల భూమి ఉందని అసెంబ్లీలో సీఎం తెలిపారు. ముఖ్యమంత్రి ప్రకటనపై 'ఎక్స్' వేదికగా కవిత స్పందించారు. "సీఎం ఈ రోజు అసెంబ్లీలో ప్రస్తావించిన నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి సహా అందరి భూములపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తున్నా. నా కుటుంబానికి ఎక్కడో భూములు ఉన్నట్టు సీఎం చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు మించి ఒక్క గజం భూమి నాకు ఎక్కువగా ఉన్నా... ఎన్నికల అఫిడవిట్ లో పేర్కొన్న దానికన్నా గజం భూమి అదనంగా ఉన్నా... ప్రభుత్వానికే సరెండర్ చేస్తానని మరోమారు స్పష్టం చేస్తున్నా" అని కవిత తెలిపారు.

# 3 లక్షల ఎకరాల
# ప్రైవేటు భూముల వివరాలు బయటపెట్టాలి



2 లో

- » భూదాన్ భూములపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయాలి
- » 22ఏలో జరిగిన తప్పిదాలపై దర్యాప్తు అవసరం
- » మంత్రులు, అధికారుల పాత్ర తేల్చాలి
- » ధరణి తప్పిదాలతో ప్రజలకు నష్టం: కూనంనేని
- » నిజాం కాలం భూముల వివరాలు వెలికితీయాలి
- » స్థలం లేనివారికి భూములు ఇవ్వాలి
- » భూపోరాటాల్లో కమ్యూనిస్టుల పాత్ర: కూనంనేని

# 34 ఏళ్ల అజ్ఞాత జీవితం తర్వాత లొంగుబాటు

- ప్రజాజీవితంలోకి మావోయిస్టు సుశీల
- నిజామాబాద్ సీపీ ఎదుట లొంగిపోయిన సుశీలరాణి
- ఛత్తీస్‌గఢ్ డివిజన్ కమిటీ సభ్యురాలు
- 1992లో అజ్ఞాతంలోకి వెళ్లిన సుశీల
- ఎన్‌కౌంటర్లలో పలుమార్లు తృటిలో తప్పిన వైనం
- 1998 కాల్పుల్లో ఛాతి, కాలికి బుల్లెట్ గాయాలు
- 2001లో భర్త రామ్మోహన్‌రావు మృతి
- రూ.5 లక్షల రివార్డు చెక్కు అందజేత

**నిజామాబాద్ అర్బన్:**
మావోయిస్ట్ ఛత్తీస్‌గఢ్ డివిజన్ కమిటీ సభ్యురాలు నక్క సుశీలరాణి సీపీ సాయిచైతన్య సమక్షంలో లొంగిపోయారు. సుమారు 34 ఏళ్ల అజ్ఞాత జీవితాన్ని గడిపిన సుశీల స్వస్థలం బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్.



2లో..



# వివేకా హత్య కేసు నిందితులకు చుక్కెదురు

హైదరాబాద్:
మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నిందితులకు చుక్కెదురైంది. నిందితుల డిశ్చార్జ్ పిటిషన్లను నాంపల్లి సీబీఐ కోర్టు తిరస్కరించింది. ఏ1 గంగిరెడ్డి, ఏ3 ఉమాశంకర్‌రెడ్డి, ఏ6 ఉదయ్ పిటిషన్లు తిరస్కరణకు గురయ్యాయి. వాటికి విచారణార్హత లేదని కోర్టు పేర్కొంది.




# హైకోర్టులో రిట్ పిటిషన్ వేసిన బీఆర్ఎస్

**హైదరాబాద్:**
బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో రిట్ పిటిషన్ వేసింది. సైఫాబాద్ పీఎస్‌లో కేటీఆర్ పీఏ, పీఆర్వో విచారణ సమయంలో దుండగులు చొరబడ్డారని మాస్కులతో వచ్చి వారిని బెదిరించారని పిటిషన్‌లో తెలిపింది. ఈ నేపథ్యంలో కోర్టు స్పందించింది. ఈ అంశమై పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. కేటీఆర్ పీఏ, పీఆర్వోలకు రక్షణ కల్పించాలని తెలిపింది.



2 లో

## ఫ్యూచర్ సిటీలో
# పెట్టుబడులు పెట్టండి

- సింగపూర్ కంపెనీలకు శ్రీధర్‌బాబు ఆహ్వానం
- సెమీకండక్టర్ రంగంలో భాగస్వామ్యం పెంచాలి
- ఫ్యాబ్, అనుబంధ పరిశ్రమల అభివృద్ధికి సహకరించండి
- తెలంగాణను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దుతాం
- ఐటీ, ఎలక్ట్రానిక్స్, లైఫ్‌సైన్సెస్‌లో అవకాశాలు
- ఏరోస్పేస్, గ్రీన్ టెక్, రెన్యూవబుల్ ఎనర్జీపై దృష్టి
- 'తెలంగాణ రైజింగ్--2026'కు రావాలని ఆహ్వానం

**హైదరాబాద్:**
భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో పెట్టుబడులు పెట్టేలా సింగపూర్ కంపెనీలను ప్రోత్సహించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని కోరారు. సెమీకండక్టర్ రంగంలో సింగపూర్‌కు ఉన్న సాంకేతిక, పారిశ్రామిక అనుభవాన్ని తెలంగాణతో అనుసంధానించి.. రాష్ట్రంలో ఫ్యాబ్ పరిశ్రమలతో పాటు అనుబంధ పరిశ్రమలు, సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేసేలా సింగపూర్ కంపెనీల భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.




## సీఎం చెప్పినవన్నీ
# పచ్చి అబద్ధాలు

- 22ఏపై బీఆర్ఎస్ పోరాటం అక్షర సత్యం
- 22ఏ భూముల సమస్యపై సీఎం మాటల్లోనే గందరగోళం
- 30 లక్షల ఎకరాలపై స్పష్టత ఇవ్వాలి
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
- కాంగ్రెస్ అక్రమాలు బయటపడతాయనే భయంతోనే సస్పెన్షన్
- ధరణి అంశాన్ని పక్కదారి పట్టిస్తున్నారు
- భూ భారతిలో రూ.80 లక్షల చలాన్ల స్కామ్
- 9,200కు పైగా అక్రమ లావాదేవీలు: హరీశ్‌రావు
- అసైన్డ్ భూములు పట్టాలుగా మారుతున్నాయి: ఆరోపణ

2 లో

**హైదరాబాద్:**
22ఏ భూములపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు.

# యూపీఐ ఛార్జీలపై రాజకీయ దుమారం

మొదటి పేజీ తరువాయి

తాము స్వతంత్రంగా తీసుకున్న నిర్ణయమని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఆర్థికంగా నిలదొక్కుకోగలిగే.. అందరికీ అందుబాటులో ఉండే డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను సృష్టించడమే ఈ కొత్త విధానం వెనుక ఉన్న లక్ష్యమని పేర్కొంది. స్వయం సమృద్ధి, సమ్మిళితమైన డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను అభివృద్ధి చేయడానికే ఈ ఆలోచన చేసినట్లు తెలిపింది.

రూ.2వేల్లోపు లావాదేవీలకు ఎలాంటి ఛార్జీలూ వర్తించబోవని, ఆపైబడిన నిర్దిష్ట లావాదేవీలకు మాత్రం 0.4 శాతం ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందని ఎన్‌పీసీఐ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అక్టోబర్ 15 నుంచి ఈ ఛార్జీలు అమల్లోకి రానున్నాయని వెల్లడించింది. అలాగే, వ్యక్తుల మధ్య జరిగే నగదు లావాదేవీలు, రూ.2000లోపు వ్యాపార చెల్లింపులు ఎండీఆర్ పరిధిలోకి రావని స్పష్టంచేసింది.

ఈ ఛార్జీలపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. భారత్‌లోని జీరో ఎండీఆర్ పాలసీని అమెరికా పేమెంట్ కంపెనీలు ఎప్పటినుంచో వ్యతిరేకిస్తున్నాయని, ఆ కంపెనీల ఆకాంక్షలకు అనుగుణంగా మోదీ ప్రభుత్వం ఈ మార్పు చేసిందని ఆ పార్టీ దుయ్యబట్టింది.

**ఇది యూపీఐ ట్యాక్స్: రాహుల్ గాంధీ**

కాగా.. ఈ ఛార్జీలపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు చేశారు. దీనిని 'యూపీఐ ట్యాక్స్' గా అభివర్ణించారు. ఈ మేరకు వీడియో సందేశం విడుదల చేశారు. అందులో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ గురించి ప్రస్తావించారు. "మీరు ఏ పక్షంవైపు మొగ్గుచూపుతారని ఒకసారి ఇందిరాగాంధీకి ప్రశ్న ఎదురైంది. నేను ఎటువైపు మొగ్గుచూపను.. నిటారుగా ఉంటానని ఆమె సూటిగా బదులిచ్చారు. కానీ, మోదీజీ భిన్నమైన వైఖరి ప్రదర్శిస్తున్నారు. ఆయన ఏ పక్షం వైపు వెళ్లకుండా.. ట్రంప్ ముందు తలవంచుతున్నారు. ప్రతి భారతీయుడిపై యూపీఐ ట్యాక్స్ విధించి, ఆ డబ్బును అమెరికాకు ఇస్తున్నారు. మోదీజీ అమెరికా ముందు తలవంచడం ఆపండి. ధైర్యం తెచ్చుకొని నిటారుగా నిల్చోండి. యూపీఐ ట్యాక్స్‌ను వెనక్కి తీసుకోండి" అని రాహుల్ విమర్శించారు.

ఇక, నోటా కు మోదీ కొత్త అర్థం చెప్పారని కాంగ్రెస్ విమర్శించింది. NOTA- Narendras Ongoing Trump Appeasement అని పేర్కొంది. ఈ దేశ వ్యతిరేక నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని, మునుపటిలానే యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు లేకుండా చూడాలని డిమాండ్ చేసింది.

# 34 ఏళ్ల అజ్ఞాత జీవితం తర్వాత లొంగుబాటు

మొదటి పేజీ తరువాయి

ఆమె తండ్రి రామకృష్ణ నిజాంషుగర్ ఫ్యాక్టరీలో ఎలక్ట్రీషన్‌గా పని చేశారు. సుశీల చిన్నప్పుడే తల్లి మరణించగా, తండ్రి 2005లో గుండెపోటుతో కన్నుమూశారు.

సీపీఐ(ఎంఎల్) పీడబ్ల్యూ సెంట్రల్ ఆర్గనైజర్ రామ్మోహన్‌రావుతో హైదరాబాద్‌లో సుశీలకు పరిచయమైంది. 1990 జూలైలో వివాహం చేసుకున్న వారిద్దరూ 1992లో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. 2001లో నల్లమల అటవీప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో రామ్మోహన్‌రావు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్‌లో ఎక్కువ కాలం పని చేసిన సుశీల సైతం పలుమార్లు చావు అంచుల వరకు వెళ్లి బతికిపోయారు. 1998లో ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లా పావురాలగుట్ట ప్రాంతంలో సుశీలతోపాటు ఉన్న ఏడుగురు సభ్యుల దళం ఆశ్రయం పొందారు. రాత్రి కాపలా విధుల్లో ఉన్న దళ సభ్యుడు సోమ్లానాయక్ నిద్రిస్తున్న సభ్యుల ఆయుధాలు అన్నింటిని సేకరించి సమీపంలో దాచి పెట్టి ఏకే 47 రైఫిల్‌తో కాల్పులు జరిపాడు.

ఈ ఘటనలో సుశీలతోపాటు శాంతక్క అనే మహిళా మావోయిస్టులు గాయపడ్డారు. అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నిస్తున్న సమయంలో శాంతక్క మరణించగా.. సుశీల ఛాతి, ఎడమ కాలికి బుల్లెట్ గాయాలయ్యాయి. ఆమె సమీపంలోని బండరాల మధ్య దాక్కోగా, మరుసటి రోజు సోమ్లా నాయక్ ఆమె వద్దకు వచ్చి ఏడుగురు పోలీసులు సభ్యులపై కాల్పులు జరిపారని నమ్మబలుకుతూనే బండరాయితో ఆమెపై దాడి చేశాడు. రక్తపు మడుగులో పడిపోయిన సుశీలను చూసి చనిపోయిందని భావించిన సోమ్లానాయక్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. సమీపంలోని గ్రామస్తుల సాయంతో సుశీల ప్రాణాలతో బయటపడ్డారు. 2001 మే నల్లమల అటవీ ప్రాంతంలో, 2005 జనవరిలో ఒడిస్సాలోని మల్కాన్‌గిరి జిల్లా పూజారిగూడ, 2008 జనవరిలో ఛత్తీస్‌గఢ్‌లోని మాడ్ ప్రాంతంలో ఎన్‌కౌంటర్‌లలో సుశీల పాల్గొన్నారు.

**చెక్కు అందజేత..**

సుశీల లొంగుబాటు సందర్భంగా సీపీ సాయిచైతన్య ఆమెకు సంబంధించిన కేసుల వివరాలను వెల్లడించారు. అనంతరం రూ.5 లక్షల రివార్డు చెక్కును అందజేశారు. తాత్కాలిక ఆర్థిక సహాయం కింద ప్రస్తుతం రూ.25 వేలు అందజేశారు. లొంగిపోయిన మావోయిస్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పునరావాస విధానానికి అనుకూలంగా సుశీలకు ప్రయోజనాలు అందుతాయని సీపీ పేర్కొన్నారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ తదితరులు పాల్గొన్నారు.

## అడ్వాన్స్ టిప్ విధానం నిలిపివేయండి..
# క్యాబ్ అగ్రిగేటర్లను ఆదేశించిన కేంద్రం

క్యాబ్ బుక్ చేసుకునే ముందే డ్రైవర్‌కు టిప్ చెల్లించే విధానాన్ని నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వం అగ్రిగేటర్లను ఆదేశించింది. ఈ విధానం వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తోందని.. ఇదో అన్యాయ వ్యాపార పద్ధతి అని వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే తెలిపారు. రైడ్ పూర్తయిన తర్వాత టిప్ ఇవ్వడం వినియోగదారుడి ఇష్టంపై ఆధారపడి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. ముందుగా టిప్ ఇవ్వకపోతే రైడ్‌ను యాక్సెప్ట్ చేయరు అనే భావన ప్రయాణికులకు కలిగించొద్దని చెప్పారు. ఈ అంశంపై జాతీయ



వినియోగదారుల హెల్ప్‌లైన్ కు అనేక ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ర్యాపిడోపై సీసీపీఏ చర్యలు తీసుకుంది. రూ.10 లక్షల జరిమానా విధించింది. రైడ్ బుకింగ్ సమయంలో అదనంగా రూ.10, రూ.20, రూ.30 యాడ్ చేయాలని యాప్ సూచిస్తున్నట్లు గుర్తించింది. ఎక్కువ మొత్తం చెల్లిస్తే రైడ్ లభించే అవకాశం పెరుగుతుందని సందేశాలు ఇస్తున్నట్లు పేర్కొంది. రైడ్ బుకింగ్ సమయంలోనే దూరం, సమయం, ట్రాఫిక్, టోల్ వంటి వివిధ అంశాల ఆధారంగా ఛార్జీ నిర్ణయిస్తారని సీసీపీఏ తెలిపింది. ఆ తర్వాత అదే రైడ్‌కు అదనంగా చెల్లించాలని కోరడం సమర్థనీయం కాదని పేర్కొంది. ఈ విషయమై ఉబర్, ఓలాపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని నిధి ఖరే తెలిపారు.

# ఝీరాం వ్యాలీ ఘటన.. 10 మంది మావోలకు మరణశిక్ష

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో పదమూడేళ్ల క్రితం మావోయిస్టులు జరిపిన దాడి కేసులో ఎన్ఐఏ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. పది మంది మావోయిస్టులను ఇప్పటికే దోషులుగా తేల్చిన న్యాయస్థానం.. వారికి మరణశిక్ష ఖరారు చేసింది. నాటి ఘటనలో కాంగ్రెస్ కీలక నేతలు సహా 29 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దోషులుగా తేలిన వారిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు.

బస్తర్ జిల్లాలోని ఝీరాం వ్యాలీలో 2013 మే 25న



కాంగ్రెస్ నిర్వహించిన పరివర్తన్ ర్యాలీని లక్ష్యంగా చేసుకొన్న మావోయిస్టులు మెరుపు దాడి చేశారు. ఆ ఘటనలో రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ దిగ్గజ నేతలు సహా 29 మంది మృతి చెందారు. నాటి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు నంద్‌కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేశ్, అసెంబ్లీలో మాజీ విపక్ష నేత మహేంద్ర కర్మా, కేంద్ర మాజీ మంత్రి విద్యా చరణ్ శుక్లా, సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఉదయ్ ముదియార్ తదితరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ కేసు విచారణ సమయంలో దాదాపు 101 మంది సాక్షుల వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం తాజాగా శిక్ష ఖరారు చేసింది.

# హెచ్‌ఐవీ విజృంభణ.. ఆ దేశంలో నేషనల్ ఎమర్జెన్సీ ప్రకటన

పసిఫిక్ మహాసముద్రంలోని ఫిజీ ద్వీప దేశం.. స్నేహపూర్వక సంస్కృతి, అందమైన బీచ్‌లు, పగడపు దిబ్బలకు ప్రసిద్ధి. కానీ, ఈ దేశం ఇప్పుడు హెచ్‌ఐవీ వ్యాప్తితో వణికిపోతోంది. కేసుల సంఖ్య పెద్దఎత్తున పెరుగుతుండటంతో అక్కడి ప్రభుత్వం 'నేషనల్ హెచ్‌ఐవీ ఎమర్జెన్సీ'ని ప్రకటించింది. 10 లక్షల్లోపే జనాభా ఉన్న ఫిజీలో ప్రస్తుతం ప్రతి 60 మంది వయోజనుల్లో ఒకరు ఈ వైరస్‌తో బాధపడుతున్నట్లు అంచనా.



గతేడాది జనవరిలో మొదటిసారి హెచ్‌ఐవీ వ్యాప్తిని ప్రకటించిన ఫిజీ ప్రభుత్వం.. పరీక్షలను ముమ్మరం చేసింది. గతేడాది కొత్తగా 2,060 కేసులు నమోదయ్యాయని ఆరోగ్యశాఖ మంత్రి డా.అటోనియో ప్రకటించారు. ప్రతి 50 మంది గర్భిణుల్లో ఒకరికి ఈ వైరస్ సోకిందన్నారు. నవజాత శిశువులకూ ఇది వ్యాప్తి చెందుతోందని, రెండు నెలల పసికందు హెచ్‌వీఐతో బాధపడుతున్నట్లు గుర్తించామని 'సేవ్ ది చిల్డ్రన్ ఫిజీ' సంస్థ పేర్కొంది. గతేడాది 59 మంది శిశువులకు వారి తల్లుల నుంచి వైరస్ సోకిందని వెల్లడించింది. డ్రగ్స్ ఎక్కించుకునేందుకు ఒకే సిరంజీని అనేక మంది ఉపయోగించడం, అసురక్షిత లైంగిక కార్యకలాపాల వంటి కారణాలతో ఈ మహమ్మారి వేగంగా వ్యాప్తి చెందుతున్నట్లు సమాచారం. అధికారిక గణాంకాల ప్రకారం.. 2021లో 25గా ఉన్న హెచ్‌ఐవీ సంబంధిత మరణాల సంఖ్య.. 2025 నాటికి 117కు పెరిగింది. స్థానికంగా హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారిలో కేవలం 39 శాతం మందికి మాత్రమే ఆ విషయం తెలుసని, నాలుగింట ఒక వంతు కంటే తక్కువ మంది మాత్రమే చికిత్స పొందుతున్నారని యూఎన్‌ఎయిడ్స్ ఫిజీ ప్రతినిధి తెలిపారు.

# హూతీల దాడి.. ఖండించిన భారత్

సౌదీఅరేబియాలోని ముస్లింల పవిత్రస్థలం మక్కా సమీపంలో హూతీలు చేసిన దాడులను భారత్ ఖండించింది . ఈ దాడులపై ఆందోళన వ్యక్తం చేసింది. పశ్చిమాసియాలో వీలైనంత త్వరగా శాంతిస్థాపన జరగాలని ఆకాంక్షించింది. అత్యంత పవిత్ర నగరంగా.. మక్కాతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలకు ప్రత్యేకమైన



అనుబంధం, భక్తి ఉన్నాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ పేర్కొన్నారు. ఇకనైనా దాడులు ఆపాలని పిలుపునిచ్చారు.

మంగళవారం ఒక డ్రోన్ మక్కా వద్ద నిషేధిత గగనతలంలోకి ప్రవేశించికముందే రాయల్ సౌదీ ఎయిర్ డిఫెన్స్ బలగాలు దానిని అడ్డుకొని, నిర్వీర్యం చేశాయని సైనిక ఉన్నతాధికారి తుర్కి అల్ మాలికి వెల్లడించారు. దాడుల నేపథ్యంలో మక్కా నగరంతోపాటు జెడ్డా, తైఫ్‌లలో హై అలర్ట్ ప్రకటించారు. మక్కా దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇలాంటి అలర్ట్ ప్రకటించడం ఇదే మొదటిసారి. అయితే తాము సౌదీ లోని పలు ప్రాంతాలను లక్ష్యం చేసుకున్నామే గానీ.. మతపరమైన ప్రదేశాల జోలికి వెళ్లలేదని హూతీలు పేర్కొన్నారు.

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు ఆదేశం

మొదటి పేజీ తరువాయి

**త్వరలోనే ధరణి పార్ట్-2 అక్రమాలు బయట పెడతాం..**

"రాష్ట్రంలో మొత్తం రూ.లక్ష కోట్ల భూ కుంభకోణం జరిగింది. భూ కుంభకోణంపై స్పెషల్ ఎంక్వయిరీ టీమ్ (ఎస్‌ఈటీ) ఏర్పాటు చేస్తాం. మొత్తం భూ కుంభకోణంపై నెల రోజుల్లో నిగ్గు తేలుస్తాం. ఇప్పటి వరకు చెప్పింది ధరణి పార్ట్-1 మాత్రమే. త్వరలోనే ధరణి పార్ట్-2 అక్రమాలు బయటపెడతాం. బీఆర్ఎస్ సభ్యులు సభలో ఉన్నప్పుడే అన్నీ బయటపెడతాం. ఈ సారి సమావేశాలకు బీఆర్ఎస్ సభ్యులు వచ్చేలా స్పీకర్ చూడాలి. నా కళ్లలోకి చూసి మాట్లాడే ధైర్యం వాళ్లకు ఉండదు. టీజీఐఐసీ భూముల్లో జరిగిన అక్రమాలను బడ్జెట్ సెషన్‌లో బయటపెడతా. ధరణిని అడ్డు పెట్టుకొని రూ.వేల కోట్లు దోచుకున్నారు. 22ఏ సమస్యల పరిష్కారానికి హైపవర్ ఆఫీసర్స్ కమిటీ ఏర్పాటు చేస్తాం. సమస్యల పరిష్కారానికి వారంలోపు సమగ్ర గైడ్‌లైన్స్ తీసుకొస్తాం. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, డీటీసీపీ లేఔట్ల దరఖాస్తులు పరిశీలిస్తాం. పెండింగ్‌లో ఉన్న, కొత్తగా వచ్చే దరఖాస్తులను పరిష్కరిస్తాం. సమస్యల పరిష్కారానికి వారంలోపు వ్యవస్థ తీసుకొస్తాం" అని సీఎం అన్నారు. మరోవైపు ఎల్బీనగర్‌లో జీవో 118 పరిధిలో ఉన్నవారందరికీ త్వరలో శుభవార్త చెబుతామని రేవంత్‌రెడ్డి అన్నారు. ఎల్బీ నగర్ నియోజకవర్గంలో స్థలాలను రెగ్యులరైజ్ చేస్తామన్నారు. జీవో 118 కింద పెండింగ్ దరఖాస్తులు నిర్ణీత గడువులో పరిష్కరిస్తామని చెప్పారు. ఈ ప్రాంతంలో 9,500 మంది బాధితులు ఉన్నారని పేర్కొన్నారు.

# ప్రైవేటు భూముల వివరాలు బయటపెట్టాలి

మొదటి పేజీ తరువాయి

కమ్యూనిస్టులు లేకుండా భూపోరాటాలు ఎక్కడా జరగలేదని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. 1945 నుంచే కమ్యూనిస్టులు పోరాటం చేస్తున్నారని చెప్పారు. ధరణిలో జరిగిన తప్పిదాలతో ప్రజలకు చాలా నష్టం జరిగిందన్నారు. 3 లక్షల ఎకరాల ప్రైవేటు భూముల వివరాలను బయటకు తీయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 22ఏ నిషేధిత భూముల అంశంపై శాసనసభలో నిర్వహించిన చర్చలో కూనంనేని మాట్లాడారు.

హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, భూదాన్ భూముల వివరాలను వెల్లడించాలన్నారు. భూదాన్ భూములపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించే అంశాన్ని ఆలోచించాలని ప్రభుత్వానికి సూచించారు. నిజాం హయాంలో సర్ఫ్‌ఖాన్ పేరిట హైదరాబాద్‌లో ఉన్న భూములు ఇప్పుడు ఎక్కడని ప్రశ్నించారు. వాటిని బయటకు తీస్తే స్థలం లేని అందరికీ ఇవ్వొచ్చన్నారు. 22ఏ విషయంలో జరిగింది సాంకేతిక తప్పిదంగా భావిస్తున్నట్లు తెలిపారు. దీనిలో మంత్రులు, అధికారుల పాత్ర ఎంత ఉందో తేల్చాలన్నారు.

# సీఎం చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలు

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు.

"కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు బయటపెడతామనే భయంతోనే మమ్మల్ని సభ నుంచి సస్పెండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారు. సభలో ప్రతిపక్షం లేకుండా, ప్రజా సమస్యలపై చర్చ లేకుండా తప్పించుకుంటున్నారు. 22ఏపై మేం చెప్పింది నిజమని.. ఇవాళ సీఎం ప్రసంగంతో తేలిపోయింది. 3లక్షల ఎకరాల సమస్య.. 30 లక్షల ఎకరాలకు పెరిగిపోయిందని సీఎం అన్నారు. 22ఏ పై గత కొంతకాలంగా బీఆర్ఎస్ చేస్తున్న పోరాటం అక్షర సత్యం.. ఇవాళ ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్న విషయం శాసనసభ సాక్షిగా తేటతెల్లమైంది. కలెక్టర్లు పాత జాబితా అప్‌లోడ్ చేశారు.. కలెక్టర్లు చూసుకోకుండా 30లక్షల ఎకరాలను 22ఏలో చేర్చారని సీఎం చెబితే.. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి మాత్రం ఒక్క ఎకరం కూడా చేర్చలేదని అన్నారు. 22ఏ నుంచి సీఎం ఇల్లును రాత్రికి రాత్రి ఎలా తీశారో.. ప్రజల భూములు కూడా అలాగే తీయాలి. ఉద్యమ నాయకుడు కేసీఆర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అవమానించారు.. బురదజల్లే ప్రయత్నం చేశారు. 22ఏ తప్పును సరిచేసుకోవాల్సిన పాలకులు విపక్షంపై ఎదురుదాడి చేస్తున్నారు. ప్రభుత్వం తప్పులను ఎత్తి చూపితే.. మాపై వ్యక్తిగతంగా ఎదురుదాడి చేస్తున్నారు. మొత్తం వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరాం.. దానిపై సమాధానం లేదు. ఎన్నికల అఫిడవిట్‌లో మేం చూపిన ఆస్తులే.. ఇప్పుడు సీఎం చెప్పారు.భూ భారతిలో రూ.80లక్షల విలువైన చలాన్ల స్కామ్ జరిగింది. ఒక్క జిల్లాలో రూ.80లక్షల చలాన్ల స్కామ్ జరిగితే .. ఎవరిపైనా చర్యలు లేవు. భూ భారతి ద్వారా ప్రజలకు తెలియకుండానే ప్రజల ఆస్తి.. మరొకరికి బదిలీ అయ్యింది. అసైన్డ్ భూములు పట్టా భూములుగా.. పట్టా భూములు అసైన్డ్ భూములుగా మారాయి. భూభారతి ద్వారా ఇప్పటికే 9,200కు పైగా అక్రమ లావాదేవీలు జరిగాయి" అని హరీశ్‌రావు ఆరోపించారు.

## ఫ్యూచర్ సిటీలో
# పెట్టుబడులు పెట్టండి

మొదటి పేజీ తరువాయి

సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ఎనర్జీ అండ్ ట్రేడ్ శాశ్వత కార్యదర్శి ఆగస్టిన్ లీ నేతృత్వంలోని ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం బుధవారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమైంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు... అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను 'గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్ హబ్'గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న చర్యలను వివరించారు. హై వాల్యూ ఇండస్ట్రీస్, ఆర్ అండ్ డీ, టెక్నాలజీ ఆధారిత పరిశ్రమలకు అవసరమైన ఎకోసిస్టమ్‌ను రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు.

ఐటీ/ఐటీఈఎస్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, లైఫ్‌సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, గ్రీన్ టెక్నాలజీ, రెన్యూవబుల్ ఎనర్జీ, లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆర్ అండ్ డీ, స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్ తదితర రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు సింగపూర్ కంపెనీలకు విస్తృత అవకాశాలున్నాయన్నాయని పేర్కొన్నారు. ఆ మేరకు తెలంగాణలో ఉన్న అనుకూలతలు, అవకాశాలపై అవగాహన కల్పించాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్--2026'లో సింగపూర్ ప్రభుత్వం, ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొనేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీజీఐఐసీ ఎండీ శశాంక, సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సీనియర్ డైరెక్టర్ డా.ఫ్రాన్సిస్ చోంగ్, ఇండియా డైరెక్టరేట్ డైరెక్టర్ జీన్ యీ, సౌత్ ఏషియా ఎంటర్ ప్రైజ్ డైరెక్టర్ ఆడ్రీ టూన్ తదితరులు పాల్గొన్నారు.

## బంగారం గని కుప్పకూలి 67 మంది దుర్మరణం

సూడాన్ లో ఘోర ప్రమాదం జరిగింది. పశ్చిమ కొర్డోఫాన్ ప్రావిన్సులోని నుహుద్ పట్టణంలో బంగారు గని ఒక్కసారిగా కుప్పకూలింది. అల్-జారా గనిలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఇప్పటి వరకు 67 మంది మృతిచెందినట్లు వైద్య బృందం, ప్రాణాలతో బయటపడినవారు తెలిపారు. ఇంకా పలువురి ఆచూకీ లభించలేదు. గని శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం సెప్టెంబర్ 17,2026

# 24 గంటల్లో హత్య కేసును ఛేదించిన జమ్మికుంట పోలీసులు

» చాకచక్యంగా దర్యాప్తు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్న పట్టణ సీఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది



**కరపత్రం ప్రతినిధి, జమ్మికుంట, సెప్టెంబర్ 16:** జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని తనుగుల గ్రామంలో భూ వివాదం నేపథ్యంలో బొజ్జపల్లి రాజబాబు హత్యకు గురైన ఘటనను జమ్మికుంట పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. పట్టణ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు చాకచక్యంగా దర్యాప్తు చేపట్టి, కేసుకు సంబంధం ఉన్న నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం.. మృతుడు ఇల్లందకుంట మండలం రాచపల్లి గ్రామానికి చెందిన బొజ్జపల్లి రాజబాబుకు తన తల్లి బొజ్జపల్లి లచ్చమ్మకు సంబంధించిన భూమి విషయంలో కుటుంబ సభ్యులతో కొంతకాలంగా వివాదాలు కొనసాగుతున్నట్లు తెలిసింది. ఆ భూమిని విక్రయించాలని రాజబాబు కోరగా కుటుంబ సభ్యులు అందుకు అంగీకరించకపోవడంతో తరచూ గొడవలు జరిగేవని పోలీసులు తెలిపారు.ఈ నేపథ్యంలో గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి భూమిని మూడు వాటాలుగా విభజించాలని నిర్ణయించినట్లు విచారణలో వెల్లడైంది. ఒక వాటాను తల్లి లచ్చమ్మకు, మరో వాటాను రాజబాబుకు, ఇంకొక వాటాను రాజబాబు తమ్ముడు కుమార్ కుమార్తె సిరిచందనకు ఇవ్వాలని సూచించినప్పటికీ రాజబాబు అందుకు అంగీకరించలేదని పోలీసులు పేర్కొన్నారు. భూమి మొత్తం తనకే చెందాలని పట్టుబట్టడంతో కుటుంబంలో విభేదాలు మరింత పెరిగినట్లు తెలిపారు.గత కొంతకాలంగా లచ్చమ్మ జమ్మికుంటలో అద్దెకు ఉంటుండగా, ఘటనకు సుమారు పది రోజుల ముందు తన కుమార్తె కవిత వద్ద ఉండేందుకు తనుగుల గ్రామానికి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులపై రాజబాబు కక్ష పెంచుకున్నట్లు విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు.

**ఇంటి వద్ద ఘర్షణ**

ఈ నెల 10న మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో రాజబాబు మద్యం సేవించి తనుగుల గ్రామంలో నివాసం ఉంటున్న తన బావ జూపాక శంకర్ ఇంటికి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అక్కడ తన తల్లి లచ్చమ్మ, అక్క కవితతో గొడవకు దిగినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు వారించేందుకు ప్రయత్నించినప్పటికీ ఘర్షణ తీవ్రరూపం దాల్చినట్లు విచారణలో వెల్లడైంది.ఈ క్రమంలో అక్కడ ఉన్న కొంతమంది కుటుంబ సభ్యులు రాజబాబును అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా ఘర్షణ చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం జరిగిన పరిణామాల్లో రాజబాబు మృతి చెందినట్లు విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు.

**మృతదేహాన్ని తరలించి పూడ్చివేత**

ఘటన అనంతరం విషయాన్ని బయటకు రాకుండా చేయాలనే ఉద్దేశంతో నిందితులు మృతదేహాన్ని దుప్పటిలో చుట్టి అదే రాత్రి తనుగుల గ్రామ శివారులోని పొలానికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. అక్కడ గుంత తీసి మృతదేహాన్ని పూడ్చిపెట్టి, పైభాగంలో మట్టి, పొరకతో కప్పినట్లు విచారణలో వెల్లడైంది.కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు సంఘటనకు సంబంధించిన పలు ఆధారాలను సేకరించారు. మృతదేహాన్ని పూడ్చేందుకు ఉపయోగించిన పార, గడ్డపార, మృతదేహాన్ని తరలించేందుకు ఉపయోగించిన సైకిల్, ఘటనకు సంబంధించిన చున్నీలు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

**పోలీసుల వేగవంతమైన దర్యాప్తు**

హత్య ఘటనపై సమాచారం అందిన వెంటనే జమ్మికుంట పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు చేపట్టారు. సంఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరించి, అనుమానితులను విచారించడంతో కేసులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. పట్టణ సీఐ శ్రీ రామకృష్ణ పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేసి 24 గంటల్లో కేసును ఛేదించినట్లు పేర్కొన్నారు.

**వివాదాలను చట్టపరంగా పరిష్కరించుకోవాలి**

భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, వ్యక్తిగత గొడవలు తదితర అంశాలపై ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని జమ్మికుంట పోలీసులు సూచించారు. ఏదైనా వివాదం తలెత్తినప్పుడు సంబంధిత పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించడంతో పాటు న్యాయస్థానాల ద్వారా చట్టపరమైన పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు. చిన్నపాటి వివాదాలు సైతం తీవ్ర పరిణామాలకు దారితీయకుండా ప్రజలు సంయమనం పాటించాలని పోలీసులు సూచించారు.

## ఆస్తి కోసం రక్తసంబంధీకులే హత్య!

- రాజబాబు అనుమానాస్పద మృతి కేసులో సంచలన విషయాలు
- ఇంటికి పిలిచి మంచానికి కట్టేసి గొంతు నులిమినట్లు పోలీసుల వెల్లడి
- అనంతరం మృతదేహాన్ని పొలంలో పాతిపెట్టినట్లు ఆరోపణ
- తల్లి, సోదరి, బావతో పాటు మరో నలుగురిపై కేసు
- ఆస్తి వివాదమే హత్యకు కారణమని ఏసీపీ మాధవి వెల్లడి




**కరపత్రం ప్రతినిధి, జమ్మికుంట:సెప్టెంబర్ 16** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం తనుగుల గ్రామంలో వారం రోజుల క్రితం చోటుచేసుకున్న రాజబాబు అనుమానాస్పద మృతి కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆస్తి వివాదమే హత్యకు కారణమని పోలీసులు వెల్లడించారు.రాజబాబును ఇంటికి పిలిపించి మంచానికి కట్టేసి గొంతు నులిమి హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని పొలంలో పాతిపెట్టినట్లు హుజురాబాద్ ఏసీపీ మాధవి తెలిపారు. ఈ ఘటనలో మృతుడి తల్లి, సోదరి, బావతో పాటు మృతుడి బావ స్నేహితులు కలిసి పాల్గొన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని ఆమె పేర్కొన్నారు.ఈ ఘటనకు సంబంధించి మొత్తం ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ వెల్లడించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, మృతదేహానికి నిర్వహించిన పోస్టుమార్టం నివేదిక అందిన అనంతరం మరిన్ని పూర్తి వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.రక్తసంబంధీకుల మధ్య ఆస్తి వివాదం చివరకు ప్రాణాలు తీసే స్థాయికి వెళ్లినట్లు పోలీసులు చెబుతున్న ఈ ఘటన తనుగుల గ్రామంలో తీవ్ర కలకలం రేపింది. అసలు ఆస్తి వివాదం ఎలా మొదలైంది..? హత్యకు దారితీసిన పరిస్థితులు ఏమిటి..? ఘటనలో మరెవరైనా పాత్ర ఉందా..? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను హుజురాబాద్ ఏసీపీ మాధవి వెల్లడించగా, సమావేశంలో జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ, జమ్మికుంట తహసీల్దార్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల పనివేళల్లోనే సిగరెట్ పొగలు!

» విద్యార్థుల సమక్షంలో ఉపాధ్యాయుడి ధూమపానంపై విమర్శలు
» విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్

**కరపత్రం ప్రతినిధి -తిమ్మాపూర్:** తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీ యూపీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు పాఠశాల పనివేళల్లోనే సిగరెట్ తాగుతున్నట్లు ఆరోపణలు రావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. విద్యార్థులకు ఆదర్శంగా నిలవాల్సిన ఉపాధ్యాయుడు పాఠశాల ప్రాంగణంలో ధూమపానం చేస్తున్నారనే ఆరోపణలపై తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సమక్షంలో ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉండగా, ఇలాంటి ఘటనలు చిన్నారులపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. పాఠశాల పరిసరాల్లో ధూమపానం చేయడం వల్ల విద్యార్థులకు తప్పుడు సందేశం వెళ్లే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సదరు ఉపాధ్యాయుడు తరచూ పాఠశాల పనివేళల్లో ధూమపానం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నప్పటికీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను నిర్ధారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, పాఠశాల క్రమశిక్షణను దృష్టిలో ఉంచుకుని బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## మాజీ సీఎం కేసీఆర్ భూములపై విచారణకు ఆదేశాలను స్వాగతిస్తున్నాం

మాజీ ముఖ్యమంత్రి గజ్వేల్ ఎమ్మెల్యే కె.చంద్రశేఖర్ రావు సంబంధించిన భూములపై ల్యాండ్ సీలింగ్ యాక్ట్ కింద విచారణకు ఆదేశాలు జారీ చేయడాన్ని జనసేన పార్టీ నాయకులు, కేవీబీ ఫౌండేషన్ చైర్మన్ కమ్మరి శ్రీను స్వాగతించారు గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమ్మరి శ్రీను మాట్లాడుతూ, భూ చట్టాలకు సంబంధించిన నిబంధనలు అందరికీ సమానంగా వర్తించాలని అన్నారు. ఒక వ్యక్తి లేదా ఒక వర్గానికి పరిమితం కాకుండా, సిద్దిపేట జిల్లాలో ఎక్కడైనా భూ అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు, ఆధారాలు ఉన్నట్లయితే వాటిపై సమగ్ర విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.సిద్దిపేట జిల్లాలో అధికారంలో ఉన్నవారు, ప్రజా ప్రతినిధులు లేదా రాజకీయంగా ప్రభావం ఉన్న వ్యక్తులపై భూ అక్రమాలకు సంబంధించిన ఆరోపణలు ఉన్నట్లయితే వాటిని కూడా విచారించాలని ఆయన కోరారు.

# హుజురాబాద్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ



- తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా విద్యార్థుల నినాదాలతో హోరెత్తిన పట్టణం






**కరపత్రం ప్రతినిధి, హుజురాబాద్, సెప్టెంబర్ 16:** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) హుజురాబాద్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం తిరంగా ర్యాలీని ఉత్సాహంగా నిర్వహించారు. జాతీయ జెండాలను చేతబూనిన విద్యార్థులు, ఏబీవీపీ కార్యకర్తలు ర్యాలీలో పాల్గొని దేశభక్తిని చాటారు. జాతీయ సమైక్యత, స్వాతంత్ర్య విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూసాల విష్ణు హాజరై ర్యాలీని ఉద్దేశించి మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అణచివేతకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు, వివిధ పోరాట యోధులు ఉద్యమించారని తెలిపారు. ప్రజల పోరాటాలు, భారత ప్రభుత్వ చర్యల నేపథ్యంలో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక పరిణామాన్ని ఆయన గుర్తు చేశారు.రాష్ట్ర నాయకులు గోస్కుల అజయ్ మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానం విలీనానికి సంబంధించిన చారిత్రక పరిణామాలను వివరించారు. 1948 సెప్టెంబర్ 17న నిజాం ప్రభుత్వంపై భారత ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ పోలో' అనంతరం హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీన ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. నిజాం సైన్యాధిపతి సయ్యద్ అహ్మద్ ఎల్-ఎడ్రూస్ భారత సైన్యానికి లొంగిపోయారని, అనంతరం నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ కాల్పుల విరమణను ప్రకటించి భారతదేశంలో హైదరాబాద్ విలీనాన్ని అంగీకరించారని పేర్కొన్నారు. ఈ చారిత్రక పరిణామం తెలంగాణ చరిత్రలో కీలక ఘట్టమని, విమోచన దినోత్సవం సందర్భంగా నాటి పోరాటాలను, ప్రజల త్యాగాలను నేటి తరం విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని నాయకులు అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, జాతీయ సమైక్యత, దేశభక్తి భావాలను విద్యార్థుల్లో పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం జాతీయ జెండాలను చేతబూని ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి నినాదాలతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ సమైక్యతను చాటారు.ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి సాయి చరణ్, నగర సంయుక్త కార్యదర్శులు కుమారస్వామి, శివ, అజయ్, భార్గవ్, నగర ఉపాధ్యక్షులు చరణ్ తేజ, రాకేష్, కృష్ణ, మణిప్రీతంతో పాటు ఏబీవీపీ కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య--అమృత హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం









- ◆ గ్రామీణ ప్రజలకు ఆదిత్య--అమృత హాస్పిటల్స్ ఉచిత వైద్య సేవలు
- ◆ వైద్య సేవల్లో ఆదిత్య--అమృత హాస్పిటల్స్ మరో ముందడుగు
- ◆ పేదల ఆరోగ్యానికి అండగా ఆదిత్య--అమృత హాస్పిటల్స్
- ◆ గ్రామీణ ప్రజల ఆరోగ్యంపై ఆదిత్య--అమృత హాస్పిటల్స్ ప్రత్యేక శ్రద్ధ
- ◆ ఉచిత వైద్య శిబిరాలతో ప్రజలకు చేరువవుతున్న ఆదిత్య--అమృత హాస్పిటల్స్
- ◆ వెంకటేశ్వర్లపల్లెలో ఉచిత వైద్య శిబిరం.. గ్రామస్థులకు వైద్య పరీక్షలు, ఉచిత మందుల పంపిణీ
- ◆. గ్రామీణ ప్రజలకు వైద్య పరీక్షలు, ఉచిత మందుల పంపిణీ

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, సెప్టెంబర్ 16:** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో జమ్మికుంట ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, అమృత హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లె గ్రామంలో బుధవారం నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి గ్రామస్థుల నుంచి మంచి స్పందన లభించింది.ఆదిత్య--అమృత హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వివిధ వైద్య విభాగాలకు చెందిన నిపుణులు పాల్గొని గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఆకుల శ్రీనివాస్ (జనరల్ మెడిసిన్), డాక్టర్ మహిపాల్ (జనరల్ సర్జన్), డాక్టర్ భరత్ (న్యూరాలజిస్ట్), డాక్టర్ గ్రీష్మ (గైనకాలజిస్ట్) వైద్య సేవలు అందించారు.శిబిరానికి వచ్చిన రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా షుగర్ పరీక్షలు చేశారు. పరీక్షల అనంతరం వైద్యులు రోగుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి తగిన సూచనలు, సలహాలు అందించారు. వైద్యుల సూచన మేరకు అవసరమైన మందులను సైతం ఉచితంగా అందజేశారు.ఈ సందర్భంగా ఆదిత్య, అమృత హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద, నిరుపేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, అవసరమైన సమయంలో వైద్యులను సంప్రదించేలా ప్రోత్సహించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేయడంలో భాగంగా రాబోయే రోజుల్లో జమ్మికుంట పరిసర ప్రాంతాల్లోని మరిన్ని గ్రామాల్లో కూడా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తామని హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది. గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తమ వంతు సహకారం అందిస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.వైద్య శిబిరానికి అవకాశం కల్పించి సహకరించిన గ్రామ సర్పంచ్ పోల్సాని వినోద--నారాయణరావు, ఉప సర్పంచ్ రేబెల్లి వెంకటేష్, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలకు ఆదిత్య--అమృత హాస్పిటల్స్ యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.శిబిరంలో హాస్పిటల్ వైద్య సిబ్బంది, గ్రామస్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికల్లో వ్యక్తిగత పరిశుభ్రత పై కేజీబీవీల్లో అవగాహన కార్యక్రమాలు



**కరపత్రం ప్రతినిధి ,అందోలు సెప్టెంబర్ 16:** బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మహిళా ,శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం పుల్కల్,చౌటకూరు కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత,పోషకాహారం,ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా, విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాల్సిన విధానం, శానిటరీ ప్యాడ్ల సరైన వినియోగం, భద్రపరిచే విధానం, పరిశుభ్రంగా పారవేసే విధానంపై అవగాహన కల్పించారు. పుల్కల్ కేజీబీవీలో 3,000 శానిటరీ ప్యాడ్లను శానిటరీ ప్యాడ్ బ్యాంకు ద్వారా పంపిణీ చేశారు. అలాగే బాలికల ప్రాముఖ్యతను తెలియజేస్తూ మొక్కలు నాటించారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా సమన్వయకర్త పల్లవి, సీడీపీఓ మధులిక, ఎంఈఓ శంకర్, ఎస్వో ఇంద్రజ, మెడికల్ ఆఫీసర్ శ్వేత, పంచాయతీ సెక్రటరీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, జెండర్ స్పెషలిస్ట్, ఆశా వర్కర్లు, విద్యార్థినులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలు

- కులమతాలకు అతీతంగా ఐక్యతకు ప్రతీకగా ఉత్సవాలు
- మహా అన్నదాన కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



**కరపత్రం ప్రతినిది కాజీపేట, సెప్టెంబర్ 16**
గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు సామాజిక ఐక్యతను చాటుతున్నాయని హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. హమారా హిందుస్థాన్ ఆధ్వర్యంలో కాజీపేట బాపూజీనగర్‌లో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రత్యేక పూజల్లో పాల్గొని అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. హమారా హిందుస్థాన్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గత 16 సంవత్సరాలుగా వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఏడాది మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటూ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. గణనాథుని ఆరాధనతో పాటు ప్రజల్లో భక్తి, సేవాభావం, సామాజిక సమైక్యతను పెంపొందించే సందేశాన్ని ఈ ఉత్సవాలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా గణేష్ ఉత్సవాలను నిర్వహించడం ప్రత్యేకతగా నిలుస్తోందని అన్నారు. ముఖ్యంగా గణేష్ నిమజ్జన కార్యక్రమంలో ముస్లిం సోదరులు కూడా భాగస్వాములై సహకారం అందించడం సోదరభావానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో పరస్పర గౌరవం, ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. కాజీపేట పట్టణ ప్రజలపై గణేష్ మహారాజ్ కరుణాకటాక్షాలు ప్రసరించాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని దాస్యం వినయ్ భాస్కర్ ఆకాంక్షించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో కొనసాగాలని ఆయన కోరారు. కార్యక్రమ నిర్వాహకులు నార్లగిరి వినయ్, రుంజ శివ, మారియో, నాగపూరి అరవింద్‌తో పాటు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నార్లగిరి రమేష్, గబ్బెట శ్రీనివాస్, శిరుమల్ల దశరథం, ఎం.డి. అఫ్జాల్, సంకు నర్సింగ్, కొండ్ర శంకర్, దువ్వ కనకరాజ్, కాటాపురం రాజు, గబ్బెట కరుణ్ (సిద్దు), గాజుల విజయ్, తండమల్ల వేణు, నాగపూరి వెంకటేష్, లవన్ కుమార్, బన్నీ, ప్రణయ్, ఆకాష్, సంజయ్, రజినీకాంత్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన కోసం ప్రాణత్యాగం చేసిన అమరులకు శతవందనాలు

- త్యాగధనుల పోరాట స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలి
- శ్రీనివాస రామానుజన్ ఒలంపియాడ్ స్కూల్ అధినేత, జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు




**కరపత్రం ప్రతినిది హనుమకొండ, సెప్టెంబర్ 16**
తెలంగాణ విమోచన కోసం సాగిన చారిత్రక పోరాటంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని శ్రీనివాస రామానుజన్ ఒలంపియాడ్ స్కూల్ అధినేత, జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి అన్నారు. గురువారం 'తెలంగాణ విమోచన దినోత్సవం" - సెప్టెంబర్ 17 సందర్భంగా.. తెలంగాణ విముక్తి కోసం పోరాడి అమరులైన వీరులను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించి, అమరుల త్యాగాలకు గుర్తుగా శతవందనాలు సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ విమోచన చరిత్ర కేవలం ఒక ప్రాంతం రాజకీయ విముక్తికి సంబంధించిన ఘట్టం మాత్రమే కాదని, ప్రజల హక్కులు, స్వేచ్ఛ, ఆత్మగౌరవం కోసం సామాన్య ప్రజలు సైతం సంఘటితమై సాగించిన మహోన్నత పోరాటానికి ప్రతీక అని పేర్కొన్నారు. నిరంకుశ పాలన, సామాజిక అసమానతలు, దోపిడీ, వెట్టిచాకిరీ వంటి అనేక రకాల అణచివేతలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు ధైర్యంగా ఎదిరించి పోరాడారని గుర్తుచేశారు. తెలంగాణ విముక్తి కోసం రైతులు, కూలీలు, మహిళలు, విద్యార్థులు, యువతతో పాటు వివిధ వర్గాల ప్రజలు ఉద్యమంలో భాగస్వాములయ్యారని తెలిపారు. అనేకమంది తమ ప్రాణాలను త్యాగం చేసి భవిష్యత్ తరాలకు స్వేచ్ఛాయుత జీవితానికి బాటలు వేశారని అన్నారు. వారి త్యాగాల ఫలితంగానే తెలంగాణ ప్రజలు స్వేచ్ఛా వాతావరణంలో తమ హక్కులను అనుభవించే అవకాశం లభించిందని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను కేవలం ఉత్సవాల సందర్భంగా స్మరించుకోవడం కాకుండా, వారి ఆశయాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు తెలంగాణ చరిత్రను, ప్రజా ఉద్యమాల నేపథ్యాన్ని, అమరవీరుల త్యాగాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. చరిత్రను తెలుసుకున్నప్పుడే స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమానత్వం వంటి విలువల ప్రాధాన్యతను అర్థం చేసుకో గలమన్నారు. తెలంగాణ సమాజ అభివృద్ధిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని, విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత, మానవతా విలువలను పెంపొందించాల్సిన అవసరం ఉందని డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి పేర్కొన్నారు. అమరవీరుల త్యాగ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. 'తెలంగాణ విమోచన దినోత్సవం" సందర్భంగా స్వేచ్ఛ కోసం పోరాడిన ప్రతి యోధుడిని, ప్రజల హక్కుల కోసం ప్రాణాలను అర్పించిన ప్రతి అమరవీరుడిని హృదయపూర్వకంగా స్మరించుకుంటూ శతవందనాలు సమర్పిస్తున్నానని డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి తెలిపారు.

# త్యాగాల స్ఫూర్తితో తెలంగాణ విమోచన పోరాటాన్ని స్మరించుకోవాలి

- రజాకారుల నిరంకుశత్వాన్ని ఎదురించి పోరాడిన తెలంగాణ ధీరుల త్యాగాలు చిరస్మరణీయం
- స్వాతంత్ర్య సమరయోధులు దార్న వైకుంఠం, కాంతమ్మ" రజాకర్లతో పోరాడిన పోరాటయోధులు – వారి సేవలు చిరస్మరణీయం




**కరపత్రం ప్రతినిది నడికూడ, సెప్టెంబర్ 16**
సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన తెలంగాణ ధీరులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు 'దార్న వైకుంఠం, కాంతమ్మ" వంటి పోరాటయోధులు ఆనాటి ప్రతికూల పరిస్థితులను సైతం లెక్కచేయకుండా రజాకారుల దౌర్జన్యాలను, నిరంకుశ పాలనను ఎదురించి ప్రజల స్వేచ్ఛ కోసం పోరాడిన స్ఫూర్తిదాయక చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ విమోచన కోసం సాగిన పోరాటం వెనుక ఎందరో అమరవీరుల త్యాగాలు, కుటుంబాల వేదనలు, ప్రజల సంఘటిత పోరాటం ఉన్నాయని పేర్కొన్నారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా స్వేచ్ఛ కోసం పోరాడిన ఆ తరం ధీరుల ధైర్యసాహసాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని తెలిపారు. ఆనాటి పోరాట యోధుల జ్ఞాపకాలను కేవలం ఒకరోజు కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, వారి త్యాగాల వెనుక ఉన్న విలువలను నేటి యువతకు పరిచయం చేయాలని అన్నారు. అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం, సమాజం కోసం నిలబడే తత్వం, దేశం పట్ల బాధ్యత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ వంటి అంశాలను యువత ఆ పోరాట చరిత్ర నుంచి స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 'తెలంగాణ విమోచన దినోత్సవం" సందర్భంగా ఆనాటి పోరాట యోధులను, అమరవీరులను స్మరించుకుంటూ వారి త్యాగాలకు ఘన నివాళులర్పించాలని పిలుపునిచ్చారు. చరిత్రను తెలుసుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు మెరుగైన సమాజాన్ని నిర్మించే స్ఫూర్తి లభిస్తుందని పేర్కొన్నారు. "నాటి ధీరుల త్యాగాలు.. నేటి తరానికి స్ఫూర్తి" అనే సందేశంతో సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని స్మరించుకోవాలని కోరారు.

# అంబేద్కర్‌ను కించపరిచే వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కావు

- కల్పిత నాయకుడంటూ రాసిన పుస్తకాన్ని నిషేధించాలి.. తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి
- సీపీయూఎస్ఐ--దళిత బహుజన శ్రామిక విముక్తి జిల్లా కార్యదర్శి గడ్డం శరత్ డిమాండ్



**కరపత్రం ప్రతినిది వరంగల్, సెప్టెంబర్ 16**
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చారిత్రక పాత్రను ప్రశ్నిస్తూ, ఆయనను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రచనపై తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించాలని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ ఇండియా (సీపీయూఎస్ఐ), దళిత బహుజన శ్రామిక విముక్తి వరంగల్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. అంబేద్కర్‌ను "కల్పిత నాయకుడు"గా పేర్కొంటూ రచించిన పుస్తకాన్ని పరిశీలించి, చట్టపరమైన నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కార్యదర్శి గడ్డం శరత్ కోరారు. ఈ సందర్భంగా గడ్డం శరత్ మాట్లాడుతూ.. అంబేద్కర్ జీవితం, ఉద్యమ ప్రస్థానం, విద్యాభ్యాసం, సామాజిక సంస్కరణలు, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్ర వంటి అంశాలు చారిత్రక ఆధారాలతో నమోదై ఉన్నాయని పేర్కొన్నారు. అంటరానితనం, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా అంబేద్కర్ చేసిన పోరాటం దేశ చరిత్రలో కీలక అధ్యాయమని అన్నారు. అంబేద్కర్ విద్యాభ్యాసం ఆయన జీవితానికి ప్రత్యేక గుర్తింపు నిచ్చిందని శరత్ పేర్కొన్నారు. బరోడా మహారాజా ఉపకార వేతనంతో కొలంబియా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసించిన ఆయన, అనంతరం లండన్‌లో న్యాయ, ఆర్థిక శాస్త్ర విద్యను కొనసాగించారు. కొలంబియా విశ్వవిద్యాలయం, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఆయన విద్యాభ్యాసం చేసినట్లు అధికారిక జీవిత చరిత్రలు పేర్కొంటున్నాయి. సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా అంబేద్కర్ చేపట్టిన ఉద్యమాలు, దళితుల రాజకీయ హక్కుల కోసం ఆయన చేసిన కృషి దేశవ్యాప్తంగా ప్రభావం చూపాయని శరత్ అన్నారు. 1932లో జరిగిన పూణే ఒప్పందంలో అంబేద్కర్ కీలక పాత్ర పోషించారని, లండన్‌లో జరిగిన మూడు రౌండ్ టేబుల్ సమావేశాల్లోనూ అణగారిన వర్గాల హక్కులను ఆయన ప్రాతినిధ్యం వహించారని ప్రభుత్వ ఆధారాలు కూడా పేర్కొంటున్నాయని గుర్తుచేశారు.

**రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర**

స్వాతంత్ర్యం అనంతరం భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీకి అంబేద్కర్ అధ్యక్షుడిగా 1947 ఆగస్టు 29న నియమితులయ్యారని, అనంతరం స్వతంత్ర భారత తొలి న్యాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారని శరత్ తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, హక్కులకు రాజ్యాంగంలో ప్రాధాన్యం కల్పించడంలో ఆయన పాత్ర విశేషమని పేర్కొన్నారు. అంబేద్కర్ కృషిని కేవలం ఒక వర్గానికి పరిమితం చేయడం సరికాదని, విద్య, సామాజిక సంస్కరణ, కార్మిక హక్కులు, ఆర్థిక ఆలోచనలు, రాజ్యాంగ నిర్మాణం వంటి అనేక రంగాల్లో ఆయన చేసిన కృషిని చరిత్ర నమోదు చేసిందని అన్నారు. అంబేద్కర్ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు జరగకుండా ప్రభుత్వం, మేధావులు, సామాజిక సంస్థలు స్పందించాలని గడ్డం శరత్ కోరారు. చారిత్రక వ్యక్తులపై రచనలు చేయడం భావ ప్రకటనలో భాగమైనప్పటికీ, అవి ఆధారాలు, వాస్తవాలు, చారిత్రక పరిశోధనకు అనుగుణంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

# జిందాల్ యూనివర్సిటీలో కేటీఆర్‌తో ఎంపీ రవిచంద్ర

- తెలంగాణ ప్రగతి, పాలనలో సంస్కరణలపై అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులతో కేటీఆర్ సంభాషణ



**కరపత్రం ప్రతినిది బ్యూరో, సెప్టెంబర్ 16**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే.టీ.రామారావుతో కలిసి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్‌రావు, రాజ్యసభ మాజీ సభ్యులు కే.ఆర్.సురేష్‌రెడ్డి హర్యానాలోని సోనేపట్‌లో ఉన్న ఓ.పీ. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీని బుధవారం సందర్శించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రాజ్‌కుమార్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరిగింది. దేశంలోని ప్రముఖ ఉన్నత విద్యా సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందిన జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలో కే.టీ.రామారావు ప్రత్యేకంగా అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులతో సమావేశమై తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం, రాష్ట్ర ప్రస్థానం, పాలనలో చోటుచేసుకున్న మార్పులు, సాంకేతికత వినియోగం, అభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలపై ప్రసంగించనున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం నుంచి రాష్ట్ర నిర్మాణం వరకు సాగిన పరిణామాలు, తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పదేళ్ల పాలనలో చేపట్టిన పలు విధానపరమైన చర్యలు, పరిపాలనా సంస్కరణలు, సాంకేతిక ఆధారిత పాలన, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలను కేటీఆర్ వివరించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అదే సమయంలో తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై కూడా ఆయన తన అభిప్రాయాలను విద్యార్థులు, పరిశోధకులతో పంచుకోనున్నారు. విద్యా రంగానికి చెందిన ప్రముఖులతో, యువతతో నేరుగా చర్చించే వేదికగా ఈ కార్యక్రమం ప్రాధాన్యత సంతరించుకుంది. తెలంగాణ అనుభవాలను జాతీయ, అంతర్జాతీయ విద్యా వర్గాల ముందు వివరించేందుకు ఈ వేదిక ఉపయోగపడనుంది. రాష్ట్ర అభివృద్ధి నమూనా, సాంకేతికత ఆధారిత పరిపాలన, విధాన రూపకల్పనలో ఎదురైన సవాళ్లు వంటి అంశాలపై విద్యార్థులు, పరిశోధకులతో పరస్పర చర్చకు అవకాశం కలగనుంది. ఈ సందర్భంగా ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్‌రావు, రాజ్యసభ మాజీ సభ్యులు కే.ఆర్.సురేష్‌రెడ్డి కేటీఆర్‌తో కలిసి యూనివర్సిటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాజకీయ, పరిపాలనా అనుభవాలను విద్యా, పరిశోధనా వర్గాలతో పంచుకునే కార్యక్రమంలో వారు భాగస్వాములు కావడం విశేషంగా నిలిచింది.

# 23వ డివిజన్‌లో రూ.30 లక్షలతో సెంట్రల్ లైటింగ్

- మంత్రి కొండా సురేఖ చొరవతో వెలుగులు నింపిన ప్రధాన రహదారులు



**కరపత్రం ప్రతినిది వరంగల్, సెప్టెంబర్ 16**
నగరంలోని 23వ డివిజన్ కొత్తవాడ ప్రాంతంలో ప్రధాన రహదారులకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. మంత్రి కొండా సురేఖను ప్రత్యేకంగా కోరడంతో సుమారు రూ.30 లక్షల వ్యయంతో మంజూరైన లైటింగ్ పనులు పూర్తికావడంతో బుధవారం వాటిని స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. కొత్తవాడ 80 ఫీట్ల రోడ్డులోని అమరవీరుల స్థూపం నుంచి ఆటోనగర్ ఇందిరమ్మ విగ్రహం వరకు, అలాగే ఆటోనగర్ ప్రభుత్వ పాఠశాల నుంచి అన్‌లిమిటెడ్ ఎంజీఎం రోడ్డు వరకు ఈ సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో రాత్రివేళల్లో ఈ ప్రధాన రహదారులు మరింత వెలుగులు నింపుకోవడంతో పాటు ప్రజలకు, వాహనదారులకు రాకపోకల్లో సౌకర్యం కలగనుంది. రాష్ట్ర నాయకుడు గోపాల నవీన్ రాజ్ సూచనల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో టీ–పీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, 23వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ చిప్ప వెంకటేశ్వర్లు నేత సెంట్రల్ లైటింగ్‌ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ అధ్యక్షుడు దామెర రాజ్ కమల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొక్కుల సతీష్, రావుల రాజీవ్, మండల సురేష్, బొల్లు సతీష్, నంబి మురళి, దేవర రాము, ఎస్కే హైదర్, మామిడాల నరేష్, ఈగ శ్రీధర్, బండి రమేష్, తుమ్మ రాము, ముంద్రాతి మధుసూదన్, అయిత రాజ్ కుమార్, అయిత సమ్మయ్య, దానం రాజయ్య, బస్వరాజు మల్లేశం, జంపాల జగదీశ్వర్, పిండి మోహన్, మండల శంకర్ తదితర డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

# డాక్టర్ రఘు కుటుంబాన్ని పరామర్శించిన టీఆర్ఎస్ చీఫ్ కవిత





**కరపత్రం ప్రతినిది బ్యూరో, సెప్టెంబర్ 16**
కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన ఇన్‌చార్జి డాక్టర్ రఘును పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత పరామర్శించారు. ఇటీవల డాక్టర్ రఘు తల్లి పుష్పలత మృతి చెందిన నేపథ్యంలో జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలోని వారి నివాసానికి బుధవారం వెళ్లిన తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు (టిఆర్ఎస్) కల్వకుంట్ల కవిత.. రఘుతో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పుష్పలత చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కొద్దిసేపు మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పుష్పలత మృతి పట్ల విచారం వ్యక్తం చేసిన కవిత, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.